

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



అక్టోబర్ 17 శనివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 254 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SATURDAY OCTOBER 17 2026 | VOL:18 | ISSUE: 254 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ప్రత్యేకంగా నీటి సరఫరా..!

తీవ్రంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ప్రత్యేక నీటి సరఫరా ఉందంటూ సీఎం ఆగ్రహం

ఈ వ్యవహారంపై విచారణ జరిపించేందుకు సిద్ధమని ప్రకటన

ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర నీటి, విద్యుత్ కొరత తప్పదని వ్యాఖ్య

యాసంగిలో వరి సాగు చేయవద్దని రైతులకు ముఖ్యమంత్రి సూచన

కాళేశ్వరం అవినీతితో లక్ష కోట్ల నష్టం జరిగిందని ఆరోపణ

రాష్ట్రంలో ప్రజలు, రైతులు తీవ్ర నీటి ఎద్దడితో సతమతమవుతుంటే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు మాత్రం ప్రత్యేకంగా నీటిని తరలించుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.మంత్రులతో కలిసి రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంపై సమీక్ష నిర్వహించిన అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. (మిగతా 2వ పేజీలో..)



రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ

పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ

2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు.హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం



SIRతో ఓటు హక్కు తొలగించే ప్రయత్నం: మంత్రి పొన్నం ప్రభాకర్

నగరంలోని గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియ ద్వారా ఓటు హక్కును తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే పట్టభద్రులు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జంట నగరాల పరిధిలోని పట్టభద్రులు ఈ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ముందుకు రావాలని సూచించారు. ఓటు నమోదు ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని.. ఈ అంశంపై అవగాహన కల్పించేందుకు పార్టీ నాయకులు.. కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..



హైదరాబాద్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు, డీసీసీ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియతో పాటు ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై నాయకులతో చర్చించారు. పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి సామా రామ్మోహన్ రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వర్ష సూచన..ఐఎండీ ప్రకటన

ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో తెలంగాణలో వర్ష సూచన

హైదరాబాద్, వరంగల్ సహా 9 జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం

ఆంధ్రప్రదేశ్‌లోనూ పలుచోట్ల జల్లులు పడతాయని అంచనా

వారంగా కొనసాగుతున్న ఎండ వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం

గత వారం రోజులుగా తీవ్రమైన ఎండలతో ఇబ్బందులు (మిగతా 2వ పేజీలో..)



ఢిల్లీలో ధర్నాలతో భారీ వ్యాపార నష్టం.. పరిహారం కోరుతూ కోర్టులో రెస్టారెంట్ వ్యాపారి పిటిషన్

కన్నాట్ ప్లేస్‌లో నిరసనలపై ఢిల్లీ హైకోర్టులో వ్యాపారి పిటిషన్

ఆందోళనల వల్ల కలిగిన నష్టాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్

అక్టోబర్ 10న జరిగిన ధర్నాతో రూ.200 కోట్ల నష్టం వాటిల్లిందని ఆరోపణ

నిరసనలు, వ్యాపార హక్కుల మధ్య సమతుల్యం ఉండాలని వాదన

ఈ వ్యాజ్యంపై అక్టోబర్ 27న విచారణ జరపనున్న ఉన్నత న్యాయస్థానం

దేశ రాజధాని ఢిల్లీలోని ప్రముఖ వాణిజ్య కేంద్రం కన్నాట్ ప్లేస్‌లో అనధికారిక నిరసనలు, ఆందోళనల కారణంగా వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని, వాటిని నియంత్రించవలసిందిగా కోరుతూ ఒక రెస్టారెంట్ యజమాని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నిరసనల వల్ల సంభవించిన ఆర్థిక నష్టాలకు (మిగతా 2వ పేజీలో..)



హైదరాబాద్ కేంద్రంగా ఫేక్ డిఫెన్స్ కంపెనీలు: కేటీఆర్

- **హైదరాబాద్ ఫేక్ ఏరోస్పేస్ కంపెనీలకు అడ్డాగా మారిందని కేటీఆర్ ఆరోపణ**
- **ఈ కంపెనీలకు కాంగ్రెస్ నేతల కుటుంబాలతో సంబంధం ఉందన్న కేటీఆర్**
- **ఈ వ్యవహారంపై కేంద్ర రక్షణ మంత్రి దర్యాప్తు జరపాలని డిమాండ్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో హైదరాబాద్ (మిగతా 2వ పేజీలో..)



భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. చర్చలు చివరి దశలో ఉన్నాయన్న నిర్మల!

- **వీలైనంత త్వరగా ఒప్పందాన్ని ముగిస్తామన్న కేంద్రమంత్రి నిర్మల**
- **ఒప్పందం మొదటి దశ పూర్తయిందని, లీగల్ డ్రాఫ్ట్ సిద్ధమవుతోందని వెల్లడి**
- **ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని స్పష్టం**
- **బ్యాంకాక్‌లో జరిగిన ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ సమావేశాల్లో వ్యాఖ్యలు**

భారత్-అమెరికా మధ్య ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అమెరికాతో జరుగుతున్న చర్చలు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో భాగంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి దశ ఇప్పటికే ఖరారైందని, ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యాయపరమైన



ముసాయిదా (లీగల్ డ్రాఫ్ట్) సిద్ధం చేస్తున్నట్లు వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ (మిగతా 2వ పేజీలో..)

రైతులను త్యాగాలు కోరడమా?: ప్రభుత్వంపై కవిత విమర్శ

ఎల్ నినో ప్రభావంపై రేవంత్ ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శ

ముందస్తు హెచ్చరికలు ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపణ

వ్యవసాయ కూలీలకు రూ.12,000, జీవిత బీమా అందించాలని డిమాండ్

ఎల్ నినో ప్రభావం, రాష్ట్రంలో రాబోయే నీటి కొరతను ఎదుర్కోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వానికి దూరదృష్టి కొరవడిందని ఆమె ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఎల్ నినో ప్రభావంపై నిపుణులు ఏడాది ప్రారంభంలోనే హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని అన్నారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరవు మండలాలను ప్రకటించి కేంద్రానికి నివేదికలు (మిగతా 2వ పేజీలో..)



విజయకేరళం
తెలుగు దినపత్రిక

సం పా ద కీ యం

మానసిక ఆరోగ్యంపై మౌనం వీడాలి..

మనసుకూ చికిత్స అవసరమే!

ఆరోగ్యం అంటే శారీరక దృఢత్వమే కాదు.. మానసిక ప్రశాంతత కూడా. శరీరానికి అనారోగ్యం కలిగితే వైద్యుడిని సంప్రదించే చాలామంది, మనసులో ఆందోళన, ఒత్తిడి, నిరాశ పెరిగినప్పుడు మాత్రం వాటిని బయటకు చెప్పేందుకు వెనుకాడుతున్నారు. ఇతరులు ఏమనుకుంటారోనన్న భయం, సమాజంలో ఉన్న అపోహలు, కుటుంబ సభ్యుల నుంచి తగిన ప్రోత్సాహం లేకపోవడం ఇందుకు కారణాలుగా మారుతున్నాయి. ఫలితంగా మానసిక సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సహాయం పొందే అవకాశాలు తగ్గుతున్నాయి.మారుతున్న జీవనశైలి, ఉద్యోగ ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, విద్యాపరమైన పోటీ, భవిష్యత్తుపై అనిశ్చితి.. ఇవన్నీ మనిషి మానసిక స్థితిపై ప్రభావం చూపవచ్చు. ప్రతి ఒక్కరి జీవితంలోనూ కష్టసమయాలు సహజమే. అయితే సమస్యలు ఎక్కువకాలం కొనసాగి రోజువారీ జీవనాన్ని ప్రభావితం చేస్తున్నప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. మానసిక ఆరోగ్యంపై అవగాహన పెరగడం నేటి సమాజానికి ఎంతో అవసరం.

ఒత్తిడిని బలహీనతగా చూడకూడదు

పని ఒత్తిడి, కుటుంబ బాధ్యతలు, అప్పులు, నిరుద్యోగం వంటి సమస్యలు ఎదురైనప్పుడు మనిషి ఆందోళనకు గురికావడం సహజం. కానీ మనసులోని బాధను బయటకు చెప్పుకోలేకపోవడం సమస్యను మరింత పెంచవచ్చు. కొందరు తమ బాధను దాచిపెట్టి సాధారణంగా కనిపించేందుకు ప్రయత్నిస్తారు. మరికొందరు సహాయం కోరితే తమను బలహీనులుగా భావిస్తారేమోనని భయపడతారు.నిజానికి సమస్యను గుర్తించి సహాయం కోరడం బలహీనత కాదు. అది బాధ్యతాయుతమైన నిర్ణయం. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఒకరి మాట మరొకరు శ్రద్ధగా వినడం, తీర్పులు చెప్పకుండా అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యం. ప్రతి సమస్యకు వెంటనే పరిష్కారం చూపలేకపోయినా.. బాధలో ఉన్న వ్యక్తికి తోడుగా ఉండటం మంచి మార్పుకు ఆరంభం కావచ్చు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలి

ప్రస్తుత విద్యా వ్యవస్థలో మార్కులు, ర్యాంకులు, ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ పోటీ విద్యార్థులపై ఒత్తిడిని పెంచుతున్నాయి. తల్లిదండ్రుల ఆశలు, ఇతరులతో పోల్చడం, ఆశించిన ఫలితాలు రాకపోవడం వల్ల కొందరు విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఒక పరీక్షలో సాధించిన మార్కులే జీవితానికి అంతిమ నిర్ణయం కాదనే విషయాన్ని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి.ప్రతి విద్యార్థికి ప్రత్యేక ఆసక్తులు, సామర్థ్యాలు ఉంటాయి. వాటిని గుర్తించి ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత. పాఠశాలలు, కళాశాలల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అవసరమైనప్పుడు నిపుణుల సలహా పొందే అవకాశం విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. వైఫల్యాన్ని జీవితాంతపు ఓటమిగా కాకుండా, నేర్చుకునే ఒక అనుభవంగా స్వీకరించే వాతావరణం ఏర్పడాలి.

ఉద్యోగ జీవితంలోనూ మానసిక ప్రశాంతత ముఖ్యం

ఉద్యోగ రంగంలో లక్ష్యాలను చేరుకోవడం, గడువుల్లో పనులు పూర్తి చేయడం, ఆదాయాన్ని పెంచుకోవడం, ఉద్యోగ భద్రతను కాపాడుకోవడం వంటి అంశాలు నిరంతర ఒత్తిడికి కారణమవుతున్నాయి. పని గంటలు పెరగడం, విశ్రాంతికి సమయం లేకపోవడం, వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం తగ్గడం వల్ల అలసట, చిరాకు, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు కనిపించవచ్చు.సంస్థలు ఉద్యోగుల పనితీరును మాత్రమే కాకుండా వారి సంక్షేమాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సమంజసమైన పని గంటలు, సెలవుల వినియోగం, పరస్పర గౌరవం, సమస్యలను వెల్లడించేందుకు సురక్షితమైన వాతావరణం అవసరం. ఉద్యోగులు కూడా పని, విశ్రాంతి, కుటుంబం మధ్య సమతుల్యత పాటించేందుకు ప్రయత్నించాలి.

సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని గుర్తించాలి

సామాజిక మాధ్యమాలు సమాచారం, వినోదం, సంబంధాల కోసం ఉపయోగపడుతున్నాయి. అయితే ఇతరుల విజయాలు, ఆస్తులు, ప్రయాణాలు, వ్యక్తిగత జీవితాలను నిరంతరం చూస్తూ తమను తాము పోల్చుకోవడం కొందరిలో అసంతృప్తిని పెంచవచ్చు. ఆన్‌లైన్‌లో కనిపించే జీవితం ప్రతి ఒక్కరి వాస్తవ జీవితాన్ని పూర్తిగా ప్రతిబింబించదు.సామాజిక మాధ్యమాల వినియోగానికి పరిమితులు పెట్టుకోవడం, నిద్రకు ముందు తెరల వినియోగాన్ని తగ్గించడం, కుటుంబ సభ్యులతో ప్రత్యక్షంగా మాట్లాడేందుకు సమయం కేటాయించడం ఉపయోగకరంగా ఉంటుంది. మనసుకు విశ్రాంతినిచ్చే పుస్తక పఠనం, నడక, సంగీతం, ప్రకృతిలో గడపడం వంటి కార్యకలాపాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి.

మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలి

మానసిక ఆరోగ్య సమస్యలకు వైద్య సహాయం అవసరమైనప్పుడు అది సులభంగా అందుబాటులో ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ ద్వారా తగిన మార్గదర్శకత్వం లభించేలా చర్యలు తీసుకోవాలి. శిక్షణ పొందిన నిపుణుల సేవలు, కౌన్సెలింగ్ సదుపాయాలు, అవసరమైన చికిత్స అందుబాటులో ఉంటే చాలామంది సకాలంలో సహాయం పొందగలరు.మానసిక సమస్యలన్నీ స్వయంగా తగ్గిపోతాయని భావించడం సరికాదు. ఆందోళన లేదా నిరాశ ఎక్కువకాలం కొనసాగడం, నిద్ర లేదా ఆహారపు అలవాట్లలో గణనీయమైన మార్పులు రావడం, రోజువారీ పనులు చేయలేని పరిస్థితి ఏర్పడడం వంటి లక్షణాలు కనిపిస్తే నిపుణులను సంప్రదించడం మంచిది. వైద్య సహాయం పొందడాన్ని అపహాస్యం చేసే ధోరణి మారాలి.

కుటుంబమే తొలి అండ

మానసిక ఒత్తిడితో బాధపడుతున్న వ్యక్తికి కుటుంబం అందించే సహకారం ఎంతో విలువైనది. వారి సమస్యను చిన్నచూపు చూడకుండా, ఇతరులతో పోల్చకుండా, ఓపికగా వినాలి. అవసరమైనప్పుడు వైద్య నిపుణుల సహాయం పొందేందుకు ప్రోత్సహించాలి. ప్రతి సమస్యకు మందలింపు లేదా ఉపదేశం మాత్రమే పరిష్కారం కాదు; కొన్నిసార్లు శ్రద్ధగా వినడం, అండగా నిలవడమే మొదటి అవసరం.సమాజంలో కూడా మానసిక ఆరోగ్యంపై సానుకూల దృక్పథం పెరగాలి. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిని దూరం పెట్టడం, అపహాస్యం చేయడం, వారి అనుభవాలను తక్కువ చేసి చూడడం వంటి ధోరణులను విడనాడాలి. అనారోగ్యానికి చికిత్స అవసరమైనట్లే మానసిక ఇబ్బందులకు కూడా సరైన సహాయం అవసరమనే అవగాహన ప్రతి ఒక్కరిలో పెరగాలి.

మనసును కాపాడుకోవడం కూడా బాధ్యతే

ఆరోగ్యకరమైన జీవనశైలిలో తగిన నిద్ర, సమతుల్య ఆహారం, శారీరక చలనం, విశ్రాంతి, ఆత్మీయ సంబంధాలు కీలకమైనవి. రోజువారీ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఒకేసారి పరిష్కరించలేకపోయినా వాటిని చిన్న దశలుగా విభజించి ఎదుర్కోవచ్చు. అవసరమైనప్పుడు సహాయం కోరడం, విశ్వసనీయమైన వ్యక్తులతో మాట్లాడడం, నిపుణుల సలహా తీసుకోవడం మంచి మార్గాలు.మానసిక ఆరోగ్యం గురించి మాట్లాడటం సిగ్గుపడాల్సిన విషయం కాదు. బాధను దాచుకోవడం కన్నా పంచుకోవడం మంచిది.. సమస్యను నిర్లక్ష్యం చేయడం కన్నా సహాయం పొందడం అవసరం. శారీరక ఆరోగ్యానికి ఇచ్చే ప్రాధాన్యమే మనసుకు కూడా ఇవ్వాలి. మానసిక ఆరోగ్యంపై మౌనం వీడి, అవగాహన పెంచి, పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే ఆరోగ్యకరమైన కుటుంబాలు, సున్నితమైన సమాజం నిర్మించగలం.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ప్రత్యేకంగా నీటి సరఫరా..!

తీవ్రంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొండపోచమ్మ సాగర్ నుంచి పంచపాండవుల చెరువుకు కాలువ తవ్వి, అక్కడి నుంచి ప్రత్యేక మోటార్ల ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారని ఆరోపించారు.“రాష్ట్రంలో మరెవ్వరికీ లేని ఈ ప్రత్యేక సౌకర్యం ఒక్క కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మాత్రమే ఎందుకు కల్పించారు? ఈ నీటి తరలింపుపై నిజనిర్ధారణ విచారణ జరిపించడానికి మేము సిద్ధంగా ఉన్నాం” అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్ల కోసం లక్ష కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని, మేడిగడ్డ బ్యారేజీని కూల్చి మళ్లీ నిర్మించాలని కేంద్ర నిపుణులు సూచించారని రేవంత్ రెడ్డి తెలిపారు. 2015లో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను 299 టీఎంసీలకు తగ్గించి సంతకాలు చేసింది ఎవరని ఆయన ప్రశ్నించారు. గత దశాబ్ద కాలంలో కృష్ణా బేసిన్‌లో ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా? అని ఆయన నిలదీశారు.

హైదరాబాద్ కేంద్రంగా ఫేక్ డిఫెన్స్ కంపెనీలు: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

ఫేక్ ఏరోస్పేస్, డిఫెన్స్ షెల్ కంపెనీలకు అడ్డాగా మారుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తక్షణమే విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ... కాంగ్రెస్ నాయకుల కుటుంబాలతో సంబంధం ఉన్న మూడు కంపెనీల పేర్లను ప్రస్తావించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబానికి చెందిన ‘టెసరాక్ట్’, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన ‘రాఘవ ఏరోస్పేస్’, ‘ఐంద్రి డిఫెన్స్’ సంస్థలు వాటిలో ఉన్నాయని ఆయన ఆరోపించారు.ఈ షెల్ కంపెనీలు రక్షణ రంగానికి పరికరాలు, సమాచారం సరఫరా చేస్తే దేశ భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. “ఇలాంటి సంస్థలు సైన్యానికి పరికరాలు అందిస్తే, భారత సాయుధ బలగాలను దేవుడే కాపాడాలి” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ఈ నకిలీ కంపెనీల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని కేంద్ర నిఘా సంస్థలను కోరారు. ఈ పోస్టులో కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను కేటీఆర్ ట్యాగ్ చేశారు. గతంలో టెసరాక్ట్ సంస్థకు భూ కేటాయింపులు, ఇతర సంస్థలకు సంబంధించిన కాంట్రాక్టులపై వివాదాలు తలెత్తిన నేపథ్యంలో కేటీఆర్ తాజా ఆరోపణలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

రైతులను త్యాగాలు కోరడమా?: ప్రభుత్వంపై కవిత విమర్శ

మొదటి పేజీ తరువాయి)

సమర్పించాయని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు రైతులను త్యాగాలు చేయాలని కోరడం దారుణమని ఆమె విమర్శించారు.రాబోయే 10 నెలలు రాష్ట్రం తీవ్ర నీటి కొరతను ఎదుర్కోనుందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి దాదాపు 30 నెలలు గడుస్తున్నా ఇంకా పాత ప్రభుత్వంపై నిందలు వేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ. 12,000 ఇచ్చే పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, కరవు పరిస్థితుల దృష్ట్యా వారికి జీవిత బీమా సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదే సమయంలో, యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కవిత ఆరోపించారు. ఏవైనా ప్రైవేటు కంపెనీలతో ఒప్పందాలు జరిగాయా? అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతూ, రాష్ట్రంలో మాత్రం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. “పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది” అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు.“ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు” అని కిషన్‌రెడ్డి విమర్శించారు.ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఢిల్లీలో ధర్నాలతో భారీ వ్యాపార నష్టం.. పరిహారం కోరుతూ కోర్టులో రెస్టారెంట్ వ్యాపారి పిటిషన్

మొదటి పేజీ తరువాయి)

బాధ్యులైన వారి నుంచి పరిహారం ఇప్పించాలని ఆయన తన పిటిషన్‌లో అభ్యర్థించారు.కన్నాట్ ప్లేస్‌లోని ఒక రెస్టారెంట్ భాగస్వామి ఆయుష్ చోప్రా, తన న్యాయవాది ఉమంగ్ త్యాగి ద్వారా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. శుక్రవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. ఇదే తరహా వ్యాజ్యంపై గురువారం ఒక ఉత్తర్వు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసిన ధర్మాసనం, ఈ పిటిషన్‌పై అక్టోబర్ 27న విచారణ జరుపుతామని పేర్కొంది.కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో సమావేశం కావాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ పిటిషన్ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, సెంట్రల్ పార్క్ నిరసనలకు నిర్దేశించిన ప్రాంతం కాదని, పండుగ సీజన్‌లో ఇక్కడ ఆందోళనలు నిర్వహిస్తే వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా దెబ్బతింటాయని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు.అక్టోబర్ 10న సీజేపీ నిర్వహించిన ఆందోళనకు పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ వారు నిరసన చేపట్టారని, తత్ఫలితంగా కన్నాట్ ప్లేస్‌లోని దుకాణాలను మూసివేయాల్సి వచ్చిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ ఒక్కరోజే కన్నాట్ ప్లేస్‌లో రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల వరకు, ఢిల్లీ వ్యాప్తంగా సుమారు రూ. 2,000 కోట్ల మేర వ్యాపారం నష్టపోయిందని వ్యాపార సంఘాల అంచనాలను పిటిషనర్ ఉటంకించారు. ఈ ఆందోళనల వల్ల సవరాత్రుల సమయంలోనూ తన రెస్టారెంట్ వ్యాపారం గణనీయంగా పడిపోయిందని ఆయుష్ చోప్రా తెలిపారు.నిరసన తెలిపే హక్కుకు, వ్యాపారం చేసుకునే ప్రాథమిక హక్కుకు మధ్య సమతుల్యత ఉండాలని పిటిషనర్ వాదించారు. సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన తీర్పులను ప్రస్తావిస్తూ, నిరసనలు ఎక్కడపడితే అక్కడ కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతాల్లోనే జరగాలని కోరారు. అలాగే అక్టోబర్ 10 నాటి ఆందోళనకు బాధ్యులైన వారి నుంచి వ్యాపారులకు నష్టపరిహారం ఇప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీస్ కమిషనర్, న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ), ఢిల్లీ ప్రభుత్వాలను ప్రతివాదులుగా చేర్చారు. కాగా, ఇదే అంశంపై గురువారం జరిగిన విచారణ సందర్భంగా, సీజేపీ కార్యకలాపాలను చట్టపరంగా నియంత్రిస్తామని ఢిల్లీ పోలీసులు హైకోర్టుకు హామీ ఇచ్చారు.

భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం.. చర్చలు చివరి దశలో ఉన్నాయన్న నిర్మల!

మొదటి పేజీ తరువాయి)

గోయల్ తనకు వివరించారని నిర్మల తెలిపారు. త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంతో పాటు, ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుపై కూడా మంత్రి ప్రసంగించారు. అంతర్జాతీయంగా అనేక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, భారత్ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి తదుపరి కాలంలో, గత నాలుగైదేళ్లుగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచిందని ఆమె గుర్తుచేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సమ్మిళిత వృద్ధి విధానాలు, నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ వంటి చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆమె వివరించారు. ప్రజాధనం వినియోగం పట్ల ప్రభుత్వానికి పూర్తి జవాబుదారీతనం ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వర్ష సూచన..ఐఎండీ ప్రకటన

పడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో తెలంగాణలోనూ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా పలు జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. నేటి నుంచే వర్షాలు ప్రారంభమవుతాయని వాతావరణ శాఖ తెలపడంతో.. తీవ్రమైన ఉక్కపోత, వడగాడ్పులతో సతమతమవుతున్న ప్రజలకు ఇది పెద్ద ఊరట. రుతుపవనాల రాకతో ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడనుంది.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక
అక్టోబర్ | శనివారం | 17 | 2026

ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తం.. తాగునీటికి తొలి ప్రాధాన్యం



- రానున్న నాలుగైదు నెలలకు గ్రామాల వారీగా సూక్ష్మస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలి -- ప్రత్యేక అధికారి దాసరి హరిచందన

నల్గొండ, అక్టోబర్ 16 (విజయ కెరటం):

ఎల్ నినో ప్రభావంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో తాగునీరు, వ్యవసాయం, విద్యుత్, పశుగ్రాసం తదితర రంగాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ శాఖల కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రత్యేక అధికారి దాసరి హరిచందన ఆదేశించారు. రానున్న నాలుగైదు నెలల పాటు ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.శుక్రవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. డిసెంబర్ చివరి నాటికి ఎల్ నినో ప్రభావం తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, చివరి గ్రామం వరకు, ప్రతి ఇంటికి తాగునీరు అందించే మార్గాలపై కలెక్టర్లు ప్రణాళికలు సిద్ధం చేయాలని హరిచందన సూచించారు. గ్రామాల్లో బోర్లు, వాటర్ ట్యాంకుల పరిస్థితి, నీటి నిల్వ వనరులను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం

రబీ సీజన్‌లో రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా పెసర్లు, కందులు, ఉలవలు, ఉద్యాన పంటలు వంటి తక్కువ నీటితో పండించే పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. తుంపర, బిందు సేద్యం వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని తెలిపారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా గ్రామాల వారీగా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు.

నీటి సంరక్షణ, సోలార్ విద్యుత్‌పై అవగాహన



భూగర్భ జలాలను పెంపొందించేందుకు వి.బి.జి. రాంజీ పథకం కింద నీటి సంరక్షణ పనులు పెద్ద ఎత్తున చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో మ్యాజిక్ సోక్‌పిట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్లు, నీటి నిల్వ నిర్మాణాలు ఏర్పాటు చేయాలని, పట్టణాల్లో వృథా నీటిని తిరిగి వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. విద్యుత్ పొదుపుతో పాటు సోలార్ బ్యాటరీలు, సోలార్ మోటార్లు, సూర్యగృహ పథకం వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని, ఎండల ప్రభావంతో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి వారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి గ్రామస్థాయి ప్రణాళికలు రూపొందించాలని, వాటి ఆధారంగా మండల, జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

నల్గొండలో 34 శాతం తక్కువ వర్షపాతం

నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణం కంటే 34 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం ఉందని వివరించారు. ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాలు, తాగునీరు, వ్యవసాయంపై ప్రభావం పడుతోందన్నారు. రైతులు వరికి బదులుగా ఉద్యాన పంటలు, పెసర్లు, కందులు సాగు చేసేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వి.బి.జి. రాంజీ కింద వాననీటి సంరక్షణ పనులు చేపడుతున్నామని, తక్కువ నీటితో పంటలు పండించేందుకు అవసరమైన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు.సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తమ జిల్లాల్లో వ్యవసాయం, భూగర్భ జలాలు, తాగునీరు, విద్యుత్, పశుగ్రాసం, సాగునీటి పరిస్థితులను వివరించి ప్రత్యామ్నాయ ప్రణాళికలను ప్రత్యేక అధికారికి వివరించారు. సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, సూర్యాపేట అదనపు కలెక్టర్ హరి సింగ్, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలినా చింగ్థియాన్ మావి, వ్యవసాయ, ఉద్యానవన, భూగర్భ జలాలు, విద్యుత్, మిషన్ భగీరథ, ప్రజారోగ్యం, నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలెంల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

మార్నింగ్ వాక్‌కు సురక్షిత ప్రాంతాలనే ఎంచుకోవాలి: ఎస్పీ నరసింహ

సూర్యాపేట, అక్టోబర్ 16 (విజయ కెరటం):



సూర్యాపేట రూరల్ పరిధిలోని జనగామ హైవేపై బాలెంల గ్రామ స్టేజి వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద స్థలాన్ని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ పరిశీలించి, ఘటనకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.బాలెంల గ్రామానికి చెందిన నాగరాజు, సైదులు, జానయ్య తెల్లవారుజామున రోడ్డుపై మార్నింగ్ వాక్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన డీసీఎం వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు, సైదులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన జానయ్యను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై సూర్యాపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డీసీఎం డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నాడా అనే కోణంలో విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనంతో పాటు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. మార్నింగ్ వాక్ చేసే వారు జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ రహదారులు, రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై నడవడం ప్రమాదకరమని హెచ్చరించారు. మైదానాలు, పార్కులు, సురక్షితమైన వెంచర్లలోనే నడక సాగించాలని సూచించారు. రోడ్డు దాటేటప్పుడు ఇరువైపులా వాహనాల రాకపోకలను గమనించాలని, రహదారుల పక్కన నివసించే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. శీతాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తెల్లవారుజామున పొగమంచు కారణంగా వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాద సూచిక బోర్డులు, బ్లాక్ స్పాట్ల వద్ద వాహనదారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్‌లో వెళ్లడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం మానుకోవాలని పేర్కొన్నారు. పొగమంచు, తక్కువ వెలుతురు ఉన్నప్పుడు వేగం తగ్గించాలని, అలసటగా ఉన్నప్పుడు వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు.సూర్యాపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 'రూ==xఎజు రూరx ఎజు' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. రోడ్డు భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. తొందరపాటు కంటే ప్రాణం ముఖ్యమని, కుటుంబ సభ్యులు మన కోసం ఎదురుచూస్తుంటారని గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ రాజశేఖర్, స్థానిక ఎస్ఐ అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

దసరాలోపే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి.. రైతులను దళారుల దోపిడీ నుంచి కాపాడాలి: పాలకూరి రవి గౌడ్

నల్గొండ, అక్టోబర్ 16 (విజయ కెరటం):

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సన్న, దొడ్డు రకాలతో సహా అన్ని రకాల వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పాలకూరి రవి గౌడ్ డిమాండ్ చేశారు. దసరా పండుగలోపే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ సమస్యల కారణంగా ఈ ఏడాది వరి సాగు తగ్గడంతోపాటు పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కొద్దోగొప్పో పండిన పంటకు కూడా గిట్టుబాటు ధర లభించక రైతులు పెట్టుబడులు సైతం తిరిగి పొందలేని పరిస్థితి నెలకొందన్నారు.బియ్యం ధరలు రెట్టింపైనప్పటికీ వరి ధాన్యం ధరలు ఎందుకు పెరగడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మిల్లర్లు, దళారులు కుమ్మక్కై రైతుల ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితిపై ప్రభుత్వం, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు.ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమైనందున వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌ను అన్ని రకాల ధాన్యానికి వర్తింపజేయాలని రవి గౌడ్ డిమాండ్ చేశారు. దళారుల మాటలు నమ్మి రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించుకోవద్దని, పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టమైన భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



నిరుపేదలకు అండగా నిలిచిన మాజీ ఎంపీపీ.. 30 కుటుంబాలకు భూదానం

నల్గొండ, అక్టోబర్ 16 (విజయ కెరటం):



చెరువుగట్టు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ చైర్మన్, నార్కట్‌పల్లి మాజీ ఎంపీపీ రేగట్టే నిర్మల నరసింహారెడ్డి గ్రామంలోని ఇల్లు లేని నిరుపేదలకు అండగా నిలిచారు. సొంత ఇల్లు నిర్మించుకునేందుకు సుమారు 30 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 80 గజాల చొప్పున తన సొంత వ్యవసాయ భూమిని దానం చేశారు. గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇల్లు కట్టుకునేందుకు భూమిని దానం చేస్తానని, ప్రతి కుటుంబం సొంత ఇంటి కలను నెరవేర్చుకునేలా కృషి చేస్తానని రేగట్టే నిర్మల నరసింహారెడ్డి తెలిపారు. నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి నిర్మాణానికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ భూదానం చేసినట్లు పేర్కొన్నారు.

సోమశిల ఐకానిక్ కేబుల్ బ్రిడ్జికి ఆమోదం.. వచ్చే నెలలో శంకుస్థాపన

- తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ మధ్య తగ్గనున్న ప్రయాణ దూరం.. తిరుపతి ప్రయాణికులకు మరింత సౌకర్యం

హైదరాబాద్ అక్టోబర్ 16 విజయ కెరటం ప్రతినిధి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మార్గదర్శకత్వంలో, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృషి, చొరవతో ప్రతిష్ఠాత్మక సోమశిల ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం లభించింది. వచ్చే నెలలో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు.ఈ వంతెన నిర్మాణం పూర్తయితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ప్రయాణ దూరం, సమయం తగ్గడంతో పాటు తిరుపతి వెళ్లే ప్రయాణికులకు కూడా ఎంతో ప్రయోజనం కలగనుంది.ఈ ప్రాజెక్టుతో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా పర్యాటక రంగానికి ఊతం లభించనుంది. పరిశ్రమలు, వ్యాపారాల అభివృద్ధికి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక ప్రగతికి దోహదపడనుంది. తెలంగాణ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సోమశిల ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి కీలక ప్రాజెక్టుగా నిలవనుంది. మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రయాణికుల సమయాన్ని ఆదా చేయడం, ప్రాంతీయ అభివృద్ధికి బాటలు వేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.

రాష్ట్రంలో ఎక్స్‌పెరిమెంట్‌కు అవకాశమే లేదు.. ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారు: కంచర్ల

- గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి.. రాకేష్ రెడ్డి విజయం కోసం సమష్టిగా కృషి చేయాలి

నల్గొండ, అక్టోబర్ 16 (విజయ కెరటం):



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని నల్గొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు.నల్గొండ నగరంలోని 26 నుంచి 48వ డివిజన్ల వరకు ముఖ్య నాయకులు, డివిజన్ ఇన్‌చార్జులు, గ్రాడ్యుయేట్ ఓటర్ ఎన్‌రోల్‌లర్లతో శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి డివిజన్‌లోని నాయకులు, ఓటర్ ఎన్‌రోలర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. ఇప్పటికే నమోదు చేసుకున్న గ్రాడ్యుయేట్ ఓటర్ల వివరాలను కూడా సేకరించి నమోదు చేసుకోవాలని కోరారు.ప్రజల ముందు ఇప్పుడు రెండు మార్గాలు ఉన్నాయని, ఒకటి బీఆర్ఎస్‌ను ఆదరించడం కాగా, మరొకటి ప్రయోగం చేయడమని కంచర్ల పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు ఎక్స్‌పెరిమెంట్‌కు అవకాశం ఇవ్వకుండా బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని నాయకులు, కార్యకర్తలు అందుకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.రాకేష్ రెడ్డి విజయం ఒక్కరిది కాదని, అందరిదని పేర్కొన్న కంచర్ల.. భవిష్యత్తులో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటుకు ఈ విజయం మార్గం సుగమం చేస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని వదులుకోకుండా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి రాకేష్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్, అభిమన్యు శ్రీనివాస్, మిర్యాల యాదగిరి, రావుల శ్రీనివాస్ రెడ్డి, జమాల్ ఖాద్రి, పెరిక కరణ్ జయరాజ్, కన్నారావు, జయప్రద రెడ్డి, అయితగోని జనార్ధన్, కత్తుల నాగరాజు, అశ్వాక్, గడలే జయప్రకాష్, గంజి రాజేందర్, మిరియాల స్వామి, ఓవైజ్ షా, పొగాకు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతుల సొమ్ము స్వాహా!

మూడేళ్లలో రూ.15 కోట్ల నష్టం!

మార్కెట్ కమిటీకి జమ చేయాలి: తెలంగాణ రైతు సంఘం డిమాండ్

వరంగల్ విజయ కెరటం అక్టోబర్ 16 :



మిర్చి బస్తాల నుంచి తగ్గిస్తున్న అరకిలో పంట విలువను మార్కెట్ కమిటీకి జమ చేసి, రైతుల సంక్షేమానికి వినియోగించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం ప్రతినిధి బృందం శుక్రవారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక అనిల్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా చందర్‌రావు మాట్లాడుతూ.. 49 కిలోలకు మించి బరువున్న మిర్చి బస్తాల నుంచి అరకిలో మిర్చి విలువను తగ్గించి తక్‌పట్టీ చేస్తున్నారని, అయితే ఆ మొత్తాన్ని మార్కెట్ కమిటీకి జమ చేయకుండా వ్యాపారులే ఉంచుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆరోపించారు. 2023 ఏప్రిల్ నుంచి ఈ విధానం అమల్లో ఉందని తెలిపారు.ఏటా మార్కెట్‌కు సుమారు 20 లక్షల మిర్చి బస్తాలు వస్తుండగా, 20 శాతం బస్తాల నుంచి అరకిలో చొప్పున తగ్గిస్తే ఏడాదికి సుమారు రూ.5 కోట్ల విలువైన మిర్చిని రైతులు కోల్పోయే అవకాశం ఉందని వివరించారు. ఈ లెక్కన మూడేళ్లలో రూ.15 కోట్ల మేర నష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేశారు. గత మూడేళ్ల దడవాయి రసీదులు, రైతుల తక్‌పట్టీలను పరిశీలించి, తగ్గించిన మిర్చి విలువను లెక్కించి మార్కెట్ కమిటీకి జమ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి గోనే కుమారస్వామి, కోశాధికారి కూస సంపత్‌కుమార్, నాయకులు నాగూర్ల శంకర్రావు, ఎనిమిది ఆనందరావు, బలుసుకురి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

హమాలీ యూనియన్ అధ్యక్షుడు జగదీశ్వర్‌కు ఘన సన్మానం

కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి: కాంగ్రెస్ నాయకులు

వరంగల్ విజయ కెరటం అక్టోబర్ 16 :



కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లాలోని ప్రసిద్ధ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కార్మిక సంఘం (హమాలీ యూనియన్) అధ్యక్షుడిగా ఎన్నికైన జగదీశ్వర్‌ను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. మార్కెట్ యార్డులో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు, హమాలీల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. హమాలీల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా జగదీశ్వర్ పనిచేస్తూ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. మార్కెట్ యార్డులో కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు లభించేలా, వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు.కార్మికుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం లభించేలా కృషి చేయడం కార్మిక సంఘం ప్రధాన బాధ్యత అని నాయకులు అన్నారు. జగదీశ్వర్ నాయకత్వంలో హమాలీ యూనియన్ మరింత బలోపేతమై, కార్మికుల సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొరైల్ల వీరస్వామి, ఉప్పుల రవి, రాజబోయిన రాజు, ఎసా సాయిలు, గుభం రాజు, మిచ్చెర్ల సదానందం, ఐగ కొమురయ్య, పిండి యుగంధర్, జోగ యశోద, ఇనుముల సుధాకర్, గజేందర్, దద్దు, సాంబయ్య, రామయ్య, ఏల్లకొండ సుధాకర్, కొర్రె రమేష్‌బాబు, గడ్డల సాంబయ్య, బోని శ్రీను, మంతా భద్రయ్య, పోతరాజు అశోక్, కొర్ర లచ్చన్న, జోరు సారంగం, గుండుం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు.. రాష్ట్రస్థాయి పోటీలకు ఆహ్వానం

- **ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్‌లకు ఈ నెల 28 వరకు గడువు.. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు**

నల్గొండ, అక్టోబర్ 16 (విజయ కెరటం):



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీసు ఫ్లాగ్ డేను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ తెలిపారు.ఈ నెల 21 నుంచి 31 వరకు నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవలు, పోలీసుల కీర్తి ప్రతిష్టలను చాటిచెప్పే అంశాలపై 2025 అక్టోబర్ నుంచి 2026 అక్టోబర్ వరకు తీసిన మూడు ఫోటోలు, మూడు నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్‌లను పోటీలకు పంపించవచ్చని తెలిపారు. ఆసక్తి గల ఔత్సాహికులు ఈ నెల 28వ తేదీలోపు https://forms.gle/gVpPmmWFrWZNNRBF6 లింక్ ద్వారా తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పోలీసు ఫ్లాగ్ డే సందర్భంగా విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు సైబర్ నేరాల నివారణలో పోలీసుల, పౌరుల పాత్ర లేదా డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఎలా దూరంగా ఉండాలనే అంశాలపై పోటీలు నిర్వహిస్తారు.డిగ్రీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర లేదా తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశాల్లో వ్యాసరచన పోటీలు ఉంటాయి.

విద్యార్థులు తమ వ్యాసాలను అక్టోబర్ 26వ తేదీలోపు https://forms.gle/YkeKUscWu5LFYWFH7 లింక్ ద్వారా సమర్పించాలి. వ్యాసం 500 పదాలకు మించకుండా పేపర్‌పై రాసి, ఫొటో లేదా్రాణఖీ రూపంలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడంతో పాటు, జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విద్యార్థులు, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, షార్ట్ ఫిల్మ్ రూపకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పిలుపునిచ్చారు.

ఖాజా బౌలి దర్గాలో ఉర్సు ఉత్సవాలు.. అన్నదానం

నల్గొండ, అక్టోబర్ 16 (విజయ కెరటం):



నల్గొండ పట్టణంలోని ఖాజా బౌలి ప్రాంతంలో ఉన్న దర్గా హజ్రత్ ఖాజా ఖాదర్ మీనుల్లాషా హుస్సేనీ వద్ద శుక్రవారం ఉర్సు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 29వ వార్డు కార్పొరేటర్ ఖాజా సమయుద్దిన్ (నదీమ్) హాజరయ్యారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించగా, అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



పవర్‌లూమ్ కార్మికుల కూలీ రేట్లు పెంచాలి

- **సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా ధర్నా.. యాజమాన్యంతో చర్చలు జరపాలని కార్మిక శాఖకు వినతి**

నల్గొండ, అక్టోబర్ 16 (విజయ కెరటం):



పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పవర్‌లూమ్ కార్మికుల కూలీ రేట్లు పెంచాలని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలపై స్పందించని యాజమాన్యంతో కార్మిక శాఖ అధికారులు చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు.శుక్రవారం తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నల్గొండ కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అసిస్టెంట్ కమిషనర్ అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ సెప్టెంబర్ 30తో పవర్‌లూమ్ కార్మికుల కూలీ రేట్ల ఒప్పంద గడువు ముగిసిందని తెలిపారు. నూతన కూలీ రేట్ల పెంపు కోసం గత నాలుగు నెలలుగా పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేదన్నారు.రెండేళ్ల క్రితం జరిగిన ఒప్పందంలో నెలకు కిలో బెల్లం ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ అమలు చేయలేదని ఆరోపించారు. కూలీ రేట్లు పెంచినట్లు చూపుతూ బట్టల తయారీ రకాన్ని మార్చడం వల్ల కార్మికులకు తగిన కూలీ అందడం లేదని, శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రస్తుతం అందుతున్న కూలీ కుటుంబ పోషణకు సరిపోవడం లేదన్నారు. దసరా వంటి పెద్ద పండుగ సమయంలోనూ కార్మికులు సమ్మె



చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.కార్మిక శాఖ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని యాజమాన్యంతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని, కూలీ రేట్లు పెంచి కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని సత్తయ్య విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, గంజి రాజేష్, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గంజి నాగరాజు, ఉపాధ్యక్షుడు పెండెం బుచ్చిరాములు, ప్రచార కార్యదర్శి పసునూరి యోగానందం, పద్మానగర్ ఏరియా కార్యదర్శి సూరపల్లి భద్రయ్య, కోశాధికారి ఎలగం అంజనేయులు, ఇండస్ట్రియల్ ఏరియా కార్యదర్శి దేవులపల్లి గిరిబాబు, కోశాధికారి నిమ్మనగోటి సైదులు, నాయకులు పోశం గిరి, రాపోలు ప్రభాకర్, బోగు సతీష్, దొంత యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో వరి సాగు వద్దు.. రైతులకు ఎల్ నినో ప్రత్యేక అధికారి హెచ్చరిక

- **బోర్లు, బావుల కింద వరి వేయొద్దు.. తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటలపై దృష్టి పెట్టాలి**

నల్గొండ, అక్టోబర్ 16 (విజయ కెరటం):



ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యాసంగిలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయవద్దని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖల కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఎల్ నినో ప్రత్యేక అధికారి దాసరి హరిచందన సూచించారు. తక్కువ నీరు అవసరమయ్యే స్వల్పకాలిక పంటలను సాగు చేసుకోవాలని, ఇందుకు ప్రభుత్వం విత్తనాలు, ఇతర సహకారం అందిస్తుందని తెలిపారు.ఎల్ నినో ప్రభావంతో వ్యవసాయం, పంటలు, తాగునీరు, విద్యుత్ తదితర రంగాలపై తలెత్తే సమస్యలపై సమీక్షించేందుకు శుక్రవారం నల్గొండకు వచ్చిన ఆమె.. కనగల్ మండలం శేరి లింగోటం గ్రామంలో నీరు లేక ఎండిపోయిన వరి, పత్తి పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురిసే అవకాశం లేదని వ్యవసాయ అధికారులు, జిల్లా యంత్రాంగం ముందుగానే హెచ్చరించినప్పటికీ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు వరి సాగు చేశారని హరిచందన తెలిపారు. పంట చేతికొచ్చే దశలో భూగర్భ జలాలు అడుగంటడంతో వరి, పత్తి పంటలు ఎండిపోతున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగుతో భూగర్భ జలాల వినియోగం పెరగడంతో పాటు విద్యుత్ వినియోగం కూడా అధికమవుతుందని పేర్కొన్నారు. ఏదైనా కారణంతో పంట చేతికి రాకపోతే రైతులు మరింత ఆర్థికంగా



నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే నష్టాలను ఎదుర్కొన్న రైతులు తమ అనుభవాలను తోటి రైతులతో పంచుకొని, ఇతర రైతులు కూడా నష్టపోకుండా అవగాహన కల్పించాలని కోరారు.ముఖ్యంగా యాసంగిలో బోర్లు, బావుల కింద వరి సాగుకు దూరంగా ఉండాలని, తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని ఇతర ప్రాంతాల రైతులకు కూడా తెలియజేసి పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి శేఖర్, ఏఈవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుండె పీదిలంగా ఉండాలంటే..

రాత్రి నిద్రకు ముందు పాలను తాగడం అనేది చాలా మందికి ఆరోగ్యకరమైన అలవాటు. అయితే ఈ పాలకు ఖర్జూరం కలిపితే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. పాలు, ఖర్జూరం రెండూ శరీరానికి అవసరమైన పోషకాలు కలిగి ఉంటాయి. వీటిని కలిపి తీసుకోవడం వల్ల శక్తి పెరుగుతుంది, ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఖర్జూరం సహజంగా శక్తివంతమైన పండు. దీనిలో విటమిన్-ఎ, బీ, జ లాంటి పోషకాలు, అలాగే ఐరన్, పొటాషియం, మాంగనీస్ వంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. ఖర్జూరాన్ని కొంత సమయం నానబెట్టి తీసుకోవడం వల్ల ఈ పోషకాలు మరింత శక్తివంతంగా శరీరంలో చేరవచ్చు. ఇది మన రోగనిరోధక శక్తిని పెంచడంలో ఎంతో సహాయపడుతుంది. పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా మారతాయి. వయస్సు పెరిగే కొద్దీ ఎముకల బలహీనత, కీళ్ళ నొప్పులు వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తాయి. అప్పుడు ఈ పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఖర్జూరంలో ఉండే మాంగనీస్, కాల్షియం, ఫాస్ఫరస్ వంటి మూలకాలు ఎముకల పటుత్వాన్ని పెంచుతాయి. పాలు అందించే ప్రోటీన్, కాల్షియంతో కలిపి ఈ మూలకాలు ఎముకలకు కావలసిన బలాన్ని ఇస్తాయి.ఖర్జూరం, పాలు కలిసి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. చర్మంపై ఎలర్జీలు, మంటలు, పొడిబారిన సమస్యలు ఉంటే.. ఈ పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల ఉపశమనం పొందవచ్చు. ఖర్జూరంలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.. పాలు అందించే లాక్టిక్ ఆమ్లం చర్మాన్ని శుభ్రపరుస్తుంది. ఈ రెండు కలిపి తీసుకోవడం వల్ల చర్మం మెరుస్తుంది. పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల కండరాలు బలపడతాయి. ఈ రెండింటిలో ఉండే ప్రోటీన్ శరీరానికి అవసరమైన పోషకాన్ని అందించి కండరాల పునరుద్ధరణను వేగవంతం చేస్తుంది. ముఖ్యంగా శారీరక శ్రమ చేసిన తర్వాత పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల శరీరం కోల్పోయిన శక్తిని తిరిగి పొందుతుంది. పాలతో ఖర్జూరం తీసుకోవడం వలన రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఇది హృదయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తప్రసరణ పెరగడంతో శరీరంలోని అన్ని అవయవాలకు ఆక్సిజన్ సమర్థంగా అందుతుంది. దీని వల్ల శక్తి స్థాయి పెరుగుతూనే.. ముఖానికి సహజమైన కాంతి కూడా వస్తుంది. ఇలా పాలతో ఖర్జూరం కలిపి తాగడం ద్వారా శరీరానికి శక్తి, ఆరోగ్యం, అందం అందుతాయి.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528